# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 24-08-2024 సంపుటి : 06 సంచిక : 335 పేజీలు : 8 వెల : రూ 3-00






### జోగి తనయుడు రాజీవ్‌కు బెయిల్ మంజూరు

విజయవాడ,ఆగస్ట్23( : అగ్రి గోల్డ్ భూముల కొనుగోలు కేసులో అరెస్టయిన మాజీ మంత్రి జోగి రమేశ్ తనయుడు రాజీవ్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం రాజీవ్ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేశ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. పిటిషన్‌పై సెప్టెంబరు 3న తీర్పు వెలువరిస్తామని ధర్మాసనం తెలిపింది. చంద్రబాబు ఇంటిపై దాడికి సంబంధించి తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఆయన ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

## ఉక్రెయిన్ చేరుకున్న ప్రధాని మోడీ

జెలెన్‌స్కీతో భేటీ..స్మారక ప్రాంతం సందర్శన





కీవ్,ఆగస్ట్23 : భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యా రు. భేటీలో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అమరుల స్మారక ప్రాంతా నికి చేరుకున్న మోదీకి జెలెన్‌స్కీ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మోదీని అలిగనం చేసుకొని అక్కడి నుంచి రష్య దాడిలో మరణించిన చిన్నారుల స్మారక ప్రాంతానికి తీసుకొళ్లారు. వెళ్లే సమయంలో జెలెన్‌స్కీ భుజంపై చేతులు వేసిన మోదీ ఆత్మీయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. అక్కడ మరణించిన చిన్నారులకు మోదీ నివాళులర్పించారు.ఆ తర్వాత రష్యా దాడితో దెబ్బతిన్న ఉక్రెయిన్‌లో ఎలాంటి పరిణామలు చోటు చేసుకున్నాయి. ఎంత మేరకు చిన్నాభిన్నామైందో తెలుపుతూ స్థానిక మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను వీక్షించారు. కాగా, రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కార మార్గాలపై ఇరువురు నేతలు చర్చించనున్నారు. అంతకుముం దు రెండు రోజుల పోలెండ్ పర్యటనను ముగించుకున్న ప్రధాని మోదీ.. అక్కడి నుంచి 10 గంటల పాటు రైల్‌ఫోర్స్ వన్ రైలులో ప్రయాణించి ఉక్రెయిన్ చేరుకున్నారు. రష్యా- ఉక్రెయిన్.. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న దేశాలు. అలాంటి దేశాల మధ్య యుద్ధం ఆపే దిశగా ప్రధాని మోదీ శాంతిమంత్రమెయ్యాలని చూస్తున్నారు. అందుకే రష్యాలో పర్యటించిన ఆరు వారాల తర్వాత ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్నారు. 22వ ఇండియా-రష్యా శిఖరాగ్ర సమావేశానికి పుతిన్ ఆహ్వానంతో ఈ ఏడాది జులై 8న మాస్కోలో పర్యటించారు ప్రధాని మోదీ. ఈ సందర్భంగా పుతిన్‌ను మోదీ ఆత్మీయంగా అలింగనం చేసుకోవడం, వారిరువురూ ఆప్యాయంగా మాట్లాడుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## జగన్ అనే భూతాన్ని భూస్థాపితం చేయాలి



పేద ప్రజలకు న్యాయం జరిగేలా పాలన
గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసేలా కార్యక్రమాలు
ఉపాధి కింద వందరోజుల పని ద్వారా అభివృద్ధి
నరేగా కింద రూ.4,500 కోట్ల పనులకు అనుమతి
స్వర్ణ వానపల్లి గ్రామసభలో సిఎం చంద్రబాబు

అంబేద్కర్ కోనసీమ,ఆగస్ట్23( ): జగన్ లాంటి వ్యక్తులు ఈ సమాజానికి చేటు అని.. కానీ జగన్ అనే భూతం ఇంకా ఈ రాష్ట్రాన్ని పట్టుకుని వేలాడుతోందని ముఖ్యమ ంత్రి చంద్రబాబు విమర్శించారు. ఆ భూతాన్ని ప్రజలు శాశ్వతంగా భూస్థాపితం చేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు అని చంద్రబాబు అన్నారు. గత 5 ఏళ్ళలో గ్రామాలకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వలేదని.. సర్పంచులని వేధించారని అన్నారు. నియోజక వర్గానికి ఎమ్మెల్యే ఎంత ముఖ్యమో, గ్రామానికి సర్పంచ్ కూడా అంతే ముఖ్యం అని అన్నారు. చివరకు గత 5 ఏళ్ళలో, స్థానిక సంస్థల ఎన్నికలని అపహాస్యం చేశారని అన్నారు. ఐదేళ్లపాటు జగన్ పరదాల పాలన చేశారంటూ విమర్శించారు. జగన్ సభలు, పర్యటనలు చేయాలంటే స్కూళ్లు మూసేసేవారని, చెట్లు నరికి వేసేవారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపోతే తాము పేద ప్రజలకు న్యాయం జరిగే పాలనకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యం అన్నారు. 2014-19 మధ్య గ్రామాభివృద్ధికి స్వర్ణయుగం అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్త పేట మండలం వానపల్లిలో శుక్రవారం సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా స్వర్ణ వానపల్లి గ్రామసభకు హాజరై ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 13,326 పంచాయతీల్లో గ్రామసభలు పెట్టి.. ఈ ఏడాది నరేగా కింద రూ.4,500 కోట్ల పనులకు అనుమతి తీసుకున్నాం. నరేగా కింద వంద రోజులు పని కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఈ పథకం కింద ఈ ఏడాది 84లక్షల కుటుంబాలకు పని దొరుకుతుంది. గత ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల మహిళలు ఇబ్బంది పడ్డారు. వైకాపా సభలకు వెళ్లినవారు బయటకు వెళ్లకుండా ఇబ్బంది పెట్టారు. గ్రామాభివృద్ధిలో సర్పంచి పాత్ర కీలకం. గత ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని అననారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక నరేగా నిధులు నేతల జేబుల్లోకి వెళ్లాయి. 2014-19 మధ్య 27,444 కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్లు వేశాం. వచ్చే ఐదేళ్లలో ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు వేస్తాం. పశువుల షెడ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం చేస్తాం. గ్రామాల్లోని పేదలకు ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకుంటాం. ఇళ్లకు విద్యుత్, సురక్షిత తాగునీరు ఇచ్చే బాధ్యత మాది. వైకాపా పాలనకు, మా పాలనకు బేరీజు వేయండి. మా హయాంలో వేసిన వీధిదీపాలను కూడా వైకాపా నేతలు దొంగిలించుకు పోయారు. వైకాపా భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం. కేంద్రం సాయంతో గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం. నిరుద్యోగ యువతకు ఉపాధి ఎలా కల్పించాలనే ఎప్పుడూ ఆలోచిస్తుంటా. 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నామని సీఎం వివరించారు.

## సెజ్ బాధితులకు జగన్ పరామర్శ

ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా ఉంది
అచ్యుతాపురం ఘటన బాధాకరమని వ్యాఖ్య





అనకాపల్లి,ఆగస్ట్23 అచ్యుతాపురం ఘటన బాధాకరమని.. ప్రమాదం జరిగింది పట్టపగలైనా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని వైఎస్ జగన్ అన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ శుక్రవారం అనకాపల్లిలో పర్యటించారు. అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడి.. అనకాపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న బాధితులను ఆయన పరామర్శించారు. ఆస్పత్రిలో వారికి అందుతున్న వైద్య సేవలపై జగన్ ఆరా తీశారు. ప్రమాదం జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరఫున అండగా ఉంటామని.. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మరోవైపు, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి పరిహారం అందించింది. తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.50 లక్షలు, స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.25 లక్షల చొప్పున అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్మిక శాఖ మంత్రి కూడా తన దగ్గర వివరాలు లేవన్నారని.. ఎంతమంది చనిపోయారో తెలియదని చెప్పారని పేర్కొన్నారు. ఘటనా స్థలానికి అంబులెన్సులు కూడా రాని పరిస్థితి నెలకొందని.. బాధితుల్ని కంపెనీ బస్సుల్లో తీసుకొచ్చారని అన్నారు. తమ ప్రభుత్వ హయంలో ఎల్జీ పాలీమర్స్ ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించామని 24 గంటల్లోపే పరిహారం అందించామని గుర్తు చేశారు. ప్రమాదంపై లోతైన దర్యాప్తు జరగాలని.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు సకాలంలో పరిహారం ఇవ్వకుంటే తానే వచ్చి స్వయంగా ధర్నా చేస్తానని.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని స్పష్టం చేశారు.

## వైకాపా పాలనలో పంచాయితీ వ్యవస్థ నిర్వీర్యం



గ్రామసభల ద్వారానే అభివృద్ధికి ప్రణాళికలు
బాధ్యతగా పనిచేయాలన్నదే కూటమి లక్ష్యం
చంద్రబాబు సమర్థతోనే అప్పుల నుంచి బయటపడగలం
'స్వర్ణ గ్రామ పంచాయతీ' పేరిట నిర్వహించిన సభలో పవన్

అన్నమయ్య,ఆగస్ట్23 రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి కోసం ఆలోచించామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. గ్రామాలకు ఏం కావాలనేదానిపై చిత్తశుద్ధితో ఆలోచిస్తేనే మంచి జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి,స్వర్ణ గ్రామాలు చేసుకోవాలనేదే లక్ష్యమన్నారు. గ్రామాలు పచ్చగా ఉంటేమనమంతాహాయిగాఉంటామన్నారు.అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మైసూరువారిపల్లెలో 'స్వర్ణ గ్రామ పంచాయతీ' పేరిట నిర్వహించినగ్రామసభలోపవన్‌కల్యాణ్‌పాల్గొని మాట్లాడారు. గ్రామాభివృద్ధికి ఏం చేయాలన్న అంశంలో గ్రామసభ చాలా ముఖ్యం. ఉన్న నిధులను కూడా దారి మళ్లించిన పరిస్థితి గతంలో చూశాం. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీని బలోపేతానికి అన్ని చర్యలు చేపడుతున్నాం అన్నారు. వైసీపీ హయాంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 75 శాతం గ్రామాల్లో వైసీపీకి చెందిన సర్పంచ్‌లే ఉన్నారన్నారు. రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు.. ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి కోసమే కృషి చేయాలని పవన్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగానే అభివృద్ధే కూటమి లక్ష్యమని అన్నారు. దేశభక్తి పంచాయతీల నుంచే రావాలన్నారు. గ్రామస్థాయి నుంచి వచ్చిన నాయకులే జాతీయ స్థాయికి వెళ్లారన్నారు. పంచాయతీ వ్యవస్థ దేశానికి వెన్నెముక అని పవన్ పేర్కొన్నారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందని తెలిపారు. పదవులు తనకు అలంకరణ కాదని.. బాధ్యత అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. చంద్రబాబు అపార అనుభవం ఏపీకి అవసరమని పేర్కొన్నారు.ఏపీని అప్పుల బారి నుంచి తప్పించి.. సంపద సృష్టించేందుకుచంద్రబాబుఅనుభవంఅవసరమనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. చంద్రబాబు నుంచి నేర్చుకోవడానికి తాను ఎప్పుడూ సిద్ధమన్నారు. ప్రభుత్వ భూముల రక్షణకు సరికొత్త చట్టం తెస్తామన్నారు. ఐదేళ్లలో 20 గ్రామసభలు జరిగేలా చూస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రతి పంచాయతీకి సొంత భూమి ఉండాలన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే గూండా యాక్టు కూడా తెస్తామన్నారు. గ్రామాల్లో కళాశాలలు, క్రీడా మైదానాలు లేని దుస్థితి నెలకొందని వాపోయారు. ప్రభుత్వ భూములు ఉంటే నిర్మాణాలు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ పరంగా పంచాయతీకి ఆస్తులు లేకపోతే వ్యర్థమేనన్నారు. దాతలు ముందుకొస్తే తాను కూడా నిధులు తీసుకొచ్చి.. క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. బాధ్యతల నుంచి తాము పారిపోబోమని.. నిరంతరం పని చేస్తామని పవన్ తెలిపారు. అద్భుతాలు చేయడానికి చేతిలో మంత్రదండం లేదని.. గుండెల నిండా నిబద్ధత ఉందన్నా రు. చంద్రబాబు అనుభవం ఏపీకి అవసరమని తాను చాలా సభల్లో చెప్పానన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించగలిగేది ఒక్క చంద్రబాబేనన్నారు. లక్షల మందికి ఒకటో తేదీనే పెన్షన్లు ఇవ్వగలిగారని చంద్రబాబును పవన్ ప్రశంసించారు. తన కంటే బాగా ఆలోచించగలిగేవాళ్ల వెంట నడిచేందుకు తానెప్పుడూ సంకోచించబోనన్నారు. పరిపాలన అనుభవం ఉన్న చంద్రబాబు నుంచి ఎంతో నేర్చుకోవాలనే తపను తనకు ఉందన్నారు. ప్రజల కోసం కూలీమాదిరిగా పనిచేసేందుకు తాను సిద్ధమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

### పంచాయితీ వ్యవస్థని బలోపేతం చేసేలా సభలు

వల్లభాపురం గ్రామసభలో మంత్రి నాదెండ్ల మనోహర్

గుంటూరు,ఆగస్ట్23 :అవినీతి లేకుండా పంచాయితీ వ్యవస్థని బలోపేతం చేసుకునే విధంగా గ్రామ సభలు జరగాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం వల్లభాపురంలో గ్రామ సభలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. గ్రామ సభలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించి , వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోషల్ ఆడిట్ సక్రమంగా నిర్వహించలేదంటూ అధికారులపై మంత్రి మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగు పరుచుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూతూ మంత్రంగా కార్యక్రమాలు చేయవద్దంటూ అధికారులపై మండిపడ్డారు. తాగునీరు, పెన్షన్, ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం,మందుల సమస్యలు,మురుగు నీటి సమస్యలను మంత్రి మనోహర్ దృష్టికి గ్రామస్థులు తీసుకువచ్చారు. గతంలో స్పీకర్‌గా ఉన్న తాను కోట్లాది రూపాయలతో తెనాలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టానని మంత్రి వెల్లడించారు. గ్రామాల అభివృద్దే గ్రామ సభల ముఖ్య ఉద్దేశమన్నారు. మూడు నెలల్లోనే నిధులు తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని కూడా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు.

### ప్రజా భాగస్వామ్యంతోనే అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన

వాటికనుగుణంగానే గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు
గ్రామాల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా గ్రామ సభల నిర్వహణ
సానుకూల వాతావరణంలో ఊరు బాగుకు సమష్టి కృషి
క్రమశిక్షణతో నిధులు, ఇతర వనరుల సద్వినియోగం
జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

విజయవాడ,ఆగస్ట్23 ): గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్మా గాంధీ ఆశయాల స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సర్వతోము ఖాభివృద్ధి లక్ష్యంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రామసభలు నిర్వహిస్తోందని.. విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన జరుగుతుందని కలెక్టర్ డా. జి.సృజన అన్నారు. స్వర్ణ గ్రామ పంచాయతీలు లక్ష్యంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు జరగ్గా.. ఎన్‌టీఆర్ జిల్లాలోనూ విజయవంతం గా జరిగాయి. ఇబ్రహీంపట్నం మండలం, జూపూడి గ్రామపంచాయతీతో పాటు జగ్గయ్యేఎట మండలం, చిల్లకల్లు గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామ సభలకు స్థానిక శాసనసభ్యులతో కలిసి కలెక్టర్ సృజన హాజరయ్యారు. జూపూడిలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో కలిసి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిం చారు. అనంతరం గ్రామ సచివాల యం ఆవరణలో మొక్కలు నాటా రు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి గ్రామసభను ప్రారంభిం చారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికతోపాటు2024-25ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు గుర్తిం చిన పనుల ఆమోదానికి సభలో చర్చ జరిగింది.ఇంతవరకు చేప ట్టిన పనులు, పనులను కూడా అధికారులు . ఉపాధి హామీ పథకం వేతనదారుల హక్కులను తెలియజేశారు.

# సంపాదకీయం

శనివారం 24-08-2024

## స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం ఎక్కడ

రాజ్యాంగం ఎంత గొప్పదైనా, ఉత్తమమైనదైనా దానిని అమలు చేసే పాలకులు ఉత్తములు కాకపోతే రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరవు' అన్నారు డా. బి.ఆర్.అంబేద్కర్. స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లలో పాలకులు స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో పాలన సాగించారు. అందుకే మొదటి పంచవర్ష ప్రణాళిక విజయవంతం అయింది. సాగునీటి ప్రాజెక్టులు, కొన్ని భారీ పరిశ్రమలు దేశంలో నెలకొల్పబడ్డాయి. తర్వాతి పదేళ్ల పాటు కూడా కొంత సానుకూల వాతావరణం కొనసాగినా, రాను రానూ అధికారమే లక్ష్యంగా సాగిన రాజకీయాల కారణంగా పాలన గాడితప్పుతూ వచ్చింది. ఎన్నికల్లో గెలుపు కోసం కుల, మత, ధన ప్రభావాలను నాయక శ్రేణి పెంచి పోషిస్తూ వచ్చింది. దీంతో రాజ్యాంగం అనేది అప్రస్తుతమనే భావన పాలక వర్గాలలో బలంగా ఏర్పడిపోతూ వచ్చింది.రాజ్యాంగం అంటే పెత్తనం చెలాయించే సాధనం కాదని అది కేవలం సమాజంలో అసమానతలను చట్టబద్ధంగా తొలగించి నవ జీవనాన్ని క్రమ పద్ధతులలో నడిపే ఒక మార్గదర్శిగా ఉండాలని' అంబేద్కర్ కోరుకున్నారు. కానీ, ఇన్నేళ్ల స్వతంత్ర పాలనలో అత్యధిక సంఖ్యాకులైన సామాన్య ప్రజానీకం ప్రాథమిక అవసరాలైన నివాసం, విద్య, వైద్యాలకు దూరంగా ఉండిపోయారు. ఈ వర్గాల ప్రజల ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడుతూ అత్యంత దీన స్థితిలో తమ జీవితాలను వెళ్లదీస్తూ రావటం మనం చూస్తున్నాం. మరోవైపు దేశంలోని రాజకీయ పక్షాలు కుటుంబ పాలన, కుల, మత, వర్గ రాజకీయాల పేరుతో రాజ్యాంగాన్ని తమకు అనుకూలంగా మలచుకుంటూ ఇప్పుడున్న పరిస్థితిని మరింత దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీల నేతలు భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలు, దేశపు వాస్తవిక స్థితి, బహుళత్వపు విలువల కంటే.. తమ పార్టీ నేతల మనోభావాలకే పెద్దపీట వేస్తూ వారికి పూర్తి విధేయులుగా మారిపోవటం విషాదం. దీంతో ప్రజల సమస్యలను చర్చించాల్సిన చట్టసభలలో ఎలాంటి చర్చలు లేకుండానే దేశ భవిష్యత్తును నిర్ణయించే బిల్లులు అలవోకగా చట్టాలుగా మారిపోతున్నాయి. తమ కళ్లముందే ఇలాంటి పరిణామాలు జరుగుతున్నప్పటికీ, తాము ఓటు వేసి గెలిపించిన ప్రభుత్వాలను, పార్టీలను సామాన్య ప్రజలు నిలదీయలేకపోవటం ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్యపు బలహీనతగా మారిపోయింది. స్థానిక పాలనలోనూ ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాల్సినంతగా మన పౌరుల చైతన్యం పడిపోవటంతో.. లోకల్ బాడీ ఎన్నికల్లోనూ సీఎం రాజకీయ ప్రచారం చేయాల్సి వస్తోంది. దీంతో కింది స్థాయిలో.. కొత్త నాయకత్వం రావటం లేదు. ఇదీ మన ప్రజాస్వామ్యం.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు నిండినా, రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం వంటివి పేదలు, దిగువ వర్గాలకు అందని ద్రాక్షగానే మిగిలాయి. మరోవైపు, పాలక వర్గాల ఒంటెత్తు పోకడలు, ఏకపక్ష నిర్ణయాలతో.. రాజ్యాధికారంలో తమకు న్యాయమైన వాటా దక్కటం లేదనే అసంతృప్తి దిగువ వర్గాల యువతలో పెరుగుతూ పోతోంది. దేశపు ఉమ్మడి వనరులలో తమ వాటాను తమ కళ్లముందే కార్పొరేట్లకు కట్టబెడుతున్న పాలక వర్గాలను నిలదీయటానికి వారికి వేదికలూ లేకుండా పోతున్నాయి. ఆర్టికల్ 14 సమాజంలో పౌరులందరూ సమానమేనని, ఈ విషయంలో ప్రభుత్వాలు ఎలాంటి వివక్షత చూపరాదని చెబుతోంది. కానీ, ఇప్పట్లో ఇవేవీ బలహీన వర్గాలకు అందేలా కనిపించటం లేదు. సమాజంలో నేటికీ వారు ఏ హక్కులూ లేని, ద్వితీయ శ్రేణి పౌరులుగానే బతుకుతున్నారు. విద్య, ఉద్యోగాల్లో వివక్షత, ఆదివాసీ, గిరిజనులు హక్కుల విషయంలో గళం విప్పిన కార్యకర్తలను అరెస్టు చేసి జైల్లో పెట్టడం జరుగుతోంది. దీంతో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ దిగువ వర్గాల ప్రజలకే లేదా? అనే అనుమానం కలుగుతోంది. ప్రైవేటీకరణ కారణంగా ప్రభుత్వ రంగ సంస్థలు మూతబడటం, అందిన కాడికి అమ్మేసే ప్రక్రియ కారణంగా ప్రభుత్వ ఉద్యోగాలే లేకుండా పోవటంతో విద్య, ఉద్యోగాల్లో న్యాయమైన వాటా కోరే వాతావరణమే నేడు లేకుండా పోతోంది. ఉన్న ఉద్యోగాలనూ ఏళ్ల తరబడి భర్తీ చేయకుండా ఎన్నికల ముందు హడావుడి చేయటమే జరుగుతోంది. దీంతో దిగువ వర్గాలనుంచి చదువుకుని పట్టా పుచ్చుకున్న తొలితరం యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఉపాధి లేని విద్య వారి కుటుంబాలను ఆర్థికంగా మరింత కుంగదీస్తోంది.మరోవైపు మనదేశంలో ఎన్నికలు అనేది అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారుతోంది. చట్టసభలు ధనికుల అడ్డాలుగా మారుతున్నాయి. దర్యాప్తు సంస్థలు నిష్పాక్షికతపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వ బ్యాంకులనుంచి కార్పొరేట్లు తీసుకున్న రూ. 10.72 లక్షల కోట్ల ఋణాన్ని కేంద్రం మాఫీ చేసిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఎకానమీ రెండేళ్ల నాడు వెల్లడించింది. వీటిలో 85 శాతం రుణాలు కార్పొరేట్ కంపెనీలు చెల్లించాల్సినవే కావటం గమనార్హం. మరోవైపు, 2020-21లో బడా కార్పొరేట్స్ లాభం 5.5 లక్షల కోట్లు, 2021-22లో 9.3 లక్షల కోట్లతో దేశంలో గుప్పెడు మందితో కూడిన ప్రభుత్వ అనుకూల సూపర్ రిచ్ వర్గం బలపడింది. దేశంలోని ఒక శాతంగా ఉన్న ధనిక కుటుంబాల చేతిలో 42.5 శాతం, పది శాతం మంది చేతిలో 74.3శాతం, తొంభై శాతం చేతిలో 25.7 శాతం దేశ సంపద కేంద్రీకృతమైంది. విచిత్రంగా దేశంలో సగం జనాభా మొత్తం సంపద విలువ 2.8 శాతానికే పరిమితమైంది. గత రెండేళ్ల నుంచి ఈ సంపద కేంద్రీకృతం కావటం నిలకడగా సాగుతూనే ఉంది. ఈ ఆర్థిక గణాంకాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థల పనితీరుకు అద్దం పడుతున్నాయి. ధేశ జనాభాకు సరిపడా ఉద్యోగాల కల్పన జరగక నిరుద్యోగం పెరిగిపోతుండగా, ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకున్న యువత దేశం విడిచి, శాశ్వతంగా విదేశాలకు వలస పోతోంది. ఈ పరిణామాలను చూసినప్పుడు మన స్వాతంత్ర్యోద్యమం, మనం రాజ్యాంగపు లక్ష్యాలు నెరవేరలేదనే నిర్వేదం కలుగుతోంది.

# తన రచనలతో నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించిన మహోన్నత వ్యక్తి దాశరథి రంగాచార్య



అక్షరమే ఆయన ఆయుధం, సాయుధ పోరాటంలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ కెరటం, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటిన అభ్యుదయవాది. తన రచనలతో నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించిన మహోన్నత వ్యక్తి, తన రచనలతో సమాజాన్ని చైతన్యం చేసిన అక్షర వాచస్పతి దాశరథి రంగాచార్య. దాశరథి రంగాచార్యులు ఖమ్మం జిల్లా లోని చిట్టి గూడూరులో జన్మించారు. ఆయన అన్న ప్రముఖ కవి, సాయుధపోరాట యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. సాయుధపోరాట కాలంలో ఉపాధ్యాయునిగా, గ్రంథపాలకునిగా పనిచేశారు. సాయుధపోరాటం ముగిసాకా సికింద్రాబాద్ పురపాలక కార్పోరేషన్లో 32 ఏళ్ళు పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు. నైజాం రాజ్యంలో నిజాం పాలన కాలంలో జన్మించిన దాశరథి రంగాచార్య ఎదుగుతూండగా ఆంధ్రమహాసభ, ఆర్య సమాజాలు వేర్వేరుగా నిజాం పాలనలోని లోపాలను

### -నేడు ఆయన జయంతి

ఎదుర్కొంటున్న తీరుకు ఆకర్షితులయ్యారు. తండ్రి సనాతనవాది ఐనా అన్నగారు ప్రఖ్యాత కవి, అభ్యుదయవాది కృష్ణమాచార్యుల సాంగత్యంలో అభ్యుదయ భావాలను, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. అసమానతలకు, అణచివేతకు నిలయంగా మారిన నాటి నైజాం సమాజాన్ని గమనించి పెరిగిన రంగాచార్యులు 1945ల్లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలకమైన పాత్ర పోషించారు.తండ్రి కుటుంబకలహాల్లో భాగంగా తల్లినీ, తమనూ వదిలివేయడంతో అన్నతో పాటుగా ఉంటున్న రంగాచార్యులకు ఆపై సాయుధ పోరాటంలో కృష్ణమాచార్యులను అరెస్టు చేయడంతో కౌమార ప్రాయం ముగిసేలోపే కుటుంబ బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చింది. కుటుంబ బాధ్యతల కారణంగా గ్రంథపాలకునిగా, ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ఆనాటి సమాజంలో అసమానతల గురించి ప్రజలను చైతన్యపరిచారు. ఆ క్రమంలో రంగాచార్యుల కుటుంబంపై నైజాం ప్రభుత్వ అనుకూలురు, భాగస్వాములు దాడిచేసినా వెనుదీయలేదు. పోరాటం కీలకదశకు చేరుకున్న కాలానికి ఆయన కాంగ్రెస్ దళంలో చేరి సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో రంగాచార్యులు తుపాకీ బుల్లెట్టు దెబ్బ తప్పించుకుని ప్రాణాపాయాన్ని కూడా ఎదుర్కొన్నారు. తెలంగాణా సాయుధ పోరాటం నాటి స్థితిగతులు, ఆ కాలంలోని దారుణమైన బానిస పద్ధతులను దాశరథి రంగాచార్యులు చిల్లర దేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం నవలల్లో చిత్రీకరించారు.చిల్లర దేవుళ్లు నవలలో సాయుధపోరాటం ముందు స్థితిగతులు, మోదుగుపూలు నవలలో తెలంగాణ సాయుధ పోరాటకాలం నాటి పరిస్థితులు, అనంతర పరిస్థితులు "జనపదం"లో అక్షరీకరించారు. వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి, గంగు వంటి నవలల ద్వారా నాటి జీవన చిత్రణ చేయాలనే ప్రయత్నం ప్రారంభించారు. ఆ నవలల ప్రణాళిక పూర్తి కాకుండానే ఆళ్వారు స్వామి మరణించారు. సాయుధపోరాట యోధులుగా, సాహిత్యవేత్తలుగా ఆళ్వారుస్వామికీ, రంగాచార్యులకూ సాన్నిహిత్యం ఉండేది. పోరాటానికి పూర్వం, పోరాట కాలం, పోరాటం అనంతరం అనే విభజనతో నవలలు రాసి పోరాటాన్ని నవలలుగా రాసి అక్షరీకరించాలనీ, అది పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న సాహిత్యవేత్తలపై ఉన్న సామాజిక బాధ్యత అనే అభిప్రాయాలను వారిద్దరూ పంచుకున్నవారే కావడంతో ఆళ్వారుస్వామి మరణానంతరం ఆ బాధ్యతను రంగాచార్యులు స్వీకరించారు. ఆ నవలా పరంపరలో తొలి నవలగా 1942వరకూ ఉన్న స్థితిగతులు "చిల్లర దేవుళ్లు"లో కనిపిస్తాయి. తొలుత కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితమైన రంగాచార్యులు తదనంతర కాలంలో ఆధ్యాత్మిక భావాలను అలవరుచుకున్నారు. ఈ నేపథ్యంలో రంగాచార్యులు శ్రీమద్రామాయణం, శ్రీ మహాభారతాలను సరళంగా తెలుగులో రచించారు .రంగాచార్య రచించిన చిల్లర దేవుళు పలు భాషల్లోకి అనువాదమైంది. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం కూడా వచ్చింది. అభినవ వ్యాసుడిగా బిరుదు అందుకున్న రంగాచార్య 2015 జూన్ 8వ తేదీన కన్నుమూశారు.

## తెలంగాణ అగ్నికణం షోయబుల్లాఖాన్

మేడ్చల్ ఆగస్టు 23, (న్యూస్ పల్స్)నిజాం నిరంకుశ పాలనలో ఖాసీం రాజ్వీచే హత్యకు గురైన జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్ కి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ నివాళులు అర్పించారు. ఘట్కేసర్ పోచారంలోనీ సింగపూర్ టౌన్ షిప్ లో నివాసముంటున్న వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.ఈటల మాట్లాడుతూ తెలంగాణ అగ్నికణం షోయబుల్లాఖాన్. తెలంగాణ మట్టిబిడ్డ,రేషం గల్లబిడ్డ. అణచివేతకు, దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడిన బిడ్డ. దేశమే గర్వించదగ్గ గొప్ప మహనీయుడు షోయబుల్లాఖాన్.అతి చిన్న వయసులోనే అరాచకాలను ఎదిరించాడు. తనకున్న మేధోశక్తితో కలాన్ని పట్టి ప్రజల పక్షాన నిలిచారు. ప్రజాఉద్యమాలకు స్ఫూర్తిని ఇచ్చిన బిడ్డ షోయబుల్లాఖాన్. ఖాసింరిజ్వి అతి దుర్మార్గంగా కిరాతకంగా షోయబుల్లా ఖాన్ ను హత్య చేశాడు. ఆయన చనిపోయే ముందు కూడా నేను చనిపోవచ్చు కానీ నా రచనలు ప్రజల్ని చైతన్యవంతం చేస్తాయని చెప్పారు. అనేకమంది షోయబుల్లా ఖాన్లు పుట్టుకొస్తారని గర్వంగా రాసిన వ్యక్తి ఆయన. 76వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులు కూడా అదే స్ఫూర్తితో బ్రతుకుతున్నందుకు గర్వపడుతున్నానని అన్నారు. ..

## అది ముమ్మాటికి మమతా బెనర్జీ వైఫల్యమే : కె.నారాయణ



హైదరాబాద్ : మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. హనుమకొండలో జరుగుతున్న సీపీ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలకు హాజరై ఆయన మాట్లాడారు. దేశంలో మహిళల పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. అలాగే పశిమ బెంగాల్‌లో వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి ఘటనను సీఎం మమతా బెనర్జీ వైఫల్యంగా చూస్తామన్నారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఉద్యమిస్తామని చెప్పారు. కాగా, ఆ పార్టీ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 22 నుంచి 24 వరకు మూడు రోజుల పాటు జరుగనున్నాయి.

## మాజీ హోంగార్డ్ దారుణ హత్య


పెద్దపల్లి మాజీ హోంగార్డు దారుణ హత్యకు గురైన సంఘటన పెద్దపల్లి జిల్లా లో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరులో గ్రామానికి చెందిన మాజీ హోంగార్డు మాటూరి విజయ్ ని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. భూ వివాదం వల్లే హత్య జరిగి ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మృతుడు విజయ్ కి భూమి విషయంలో బంధువులతో గొడవ జరుగుతుండేదని మృతుని సోదరుడు తిరుపతి తెలిపారు .సమాచారంఅందుకున్న పెద్దపల్లి ఏసిపి కృష్ణ, సిఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్ఐ అశోక్ రెడ్డి లు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అప్పటి ఫైరే... ఇప్పుడు మైనస్

హైదరాబాద్, ఆగస్టు 23, (న్యూస్ పల్స్)తెలంగాణలో గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో మొదలైన ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం ఇప్పటికీ కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో గెలుపు కోసం నాటి అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పరంపర సాగింది. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో సీఎంగా ప్రమాణం చేసిన రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై దూకుడు పెంచారు. మరోవైపు బీఆర్ఎస్ అధికారం కోల్పోయినా? తాము ఎక్కడా తగ్గేది లేదు అన్నట్లు వ్యవహరిస్తోంది. దీంతో అధికార కాంగ్రెస్‌తో ప్రతిపక్ష బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ అన్నట్లుగా దూకుడు ప్రదర్శిస్తోంది. ఆరు గ్యారంటీలు, పంట రుణాలు, రైతులకు బోనస్, పంట రుణాల మాఫీ, తాజాగా హైడ్రా కూల్చివేతలపై వరుసగా రగడ జరుగుతోంది. ఇక లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రచార బాధ్యతను భుజానికి ఎత్తుకున సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికల్లో బీజేపీ లక్ష్యంగానే ప్రచారం చేశారు. దీంతో రెండు జాతీయ పార్టీలు కలిసి బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా దక్కకుండా చేశాయి. ఈ క్రమంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తివేస్తుందని ప్రచారం చేశారు. దీనిపై బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు కోర్టులో పరువు నష్టం కేసు వేశారు. ఈ క్రమంలో నాంపల్లి కోర్టు సీఎం రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇచ్చింది.లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కొత్తగూడెంలో సభలో బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని రేవంత్ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం కేసు వేశారు. కింది కోర్టు పలుమార్లు కేసును వాయిదా వేయడంతో హైకోర్టుకు వెళ్లారు కాసం. హైకోర్టు ఆదేశాలతో రేవంత్ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టు నోటీసులు ఇచ్చింది.లోకసభ ఎన్నికల్లో బీజేపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. దేశంలో రిజర్వేషన్లు రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని అన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చబోతున్నారని అన్నారు. 100 ఏళ్లలో భారత్ ను హిందూ రాజ్యాంగ మార్చాలని 1925లో ఆర్ఎస్ఎస్ ప్రతిజ్ఞ చేసిందని పేర్కొన్నారు. ఆ కుట్రలో భాగంగానే 2025లో భారత దేశాన్ని పూర్తిగా హిందూ దేశంగా మార్చబోతున్నారని అన్నారు. అందుకే 2/3 మెజారిటీ కావాలని బీజేపీ నేతలు అడుగుతున్నారని తెలిపారు. బీసీలు, ఓబీసీలపై సర్జికల్ స్ట్రైక్ చేస్తున్నారని.. రిజర్వేషన్లను రద్దు చేయమని బీజేపీ ఎందుకు చెప్పడం లేదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఈ కుట్రను తిప్పి కొట్టేందుకే కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని వ్యాఖ్యానించారు.గతంలో కేసీఆర్ సీఎం పదవిలో ఉన్నప్పుడు భారత రాజ్యాంగాన్ని మార్చలని ఆయన అన్నారని గుర్తుచేశారు సీఎం రేవంత్ రెడ్డి. అంటే బీజేపీ విధానంలో భాగంగానే ఆ మాట అన్నారా? అని నిలదీశారు. రిజర్వేషన్లపై కేసీఆర్ విధానాన్ని ప్రకటించాలి అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ విధానం ఏంటో కేసీఆర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. లోక్ సభ ఎన్నికల్లో 5 పార్లమెంట్ స్థానాలను కేసీఆర్ బీజేపీకి తాకట్టు పెట్టారని సంచలన ఆరోపణలు చేశారు. ఈటలకు వ్యతిరేకంగా కేసీఆర్ ఎక్కడా మాట్లాడలేదని పేర్కొన్నారు. రేవంత్ ప్రచారం చేసిన వ్యాఖ్యలపై బీజేపీ కోర్టును ఆశ్రయించగా.. తాజాగా నోటీసులు జారీ చేసింది.

## కుల మతాలకు అతీతంగా బంద్‌ను విజయవంతం చేయాలి : ఉద్ధవ్ ఠాక్రే

మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్ స్కూల్‌లో ఇద్దరు చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటనకు వ్యతిరేకంగా ఎంవీఏ మహారాష్ట్ర బంద్‌కు పిలుపు ఇచ్చింది. స్కూళ్లలో బాలికలకు రక్షణ లేదని ప్రజలు భావిస్తున్నారని శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. శనివారం జరిగే బంద్‌లో కేవలం మహావికాస్ అఘడి (ఎంవీఏ)యే కాకుండా అన్ని వర్గాల ప్రజలు, పౌరులందరూ పాలుపంచుకోవాలని ఠాక్రే పిలుపు ఇచ్చారు.బంద్ మధ్యాహ్నం రెండు గంటల వరకూ కొనసాగుతుందని చెప్పారు. రేపటి బంద్ సందర్భంగా బస్సులు, రైళ్లనూ ఎక్కడికక్కడ నిలిపివేయాలని ఆయన కోరారు. మీరు ఏ మతం, కులం వారైనా కావచ్చు మీ కూతుళ్లు, అక్కాచెల్లెళ్లను కాపాడుకునేందుకు బంద్‌ను విజయవంతం చేయాలని ఠాక్రే పిలుపు ఇచ్చారు. కాగా, మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్ స్కూల్‌లో చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటన కలకలం రేపింది ఈ ఘటనలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం జరుగుతోందని టీఎంసీ ఎంపీ మహువ మొయిత్ర మహారాష్ట్ర సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో వైద్యురాలి హత్యాచార ఘటనలో నిందితుడిని కొద్దిగంటల్లోనే పోలీసులు అరెస్ట్ చేశారని, కానీ బద్లాపూర్ ఘటనలో రోజులు గడిచినా ఇంతవరకూ కేసు నమోదు చేయలేదని ఎక్స్ వేదికగా ఆమె పోస్ట్ చేశారు.



# సెజ్‌లలో డేంజర్ బెల్స్

## ఈ ఏడాదే మూడు ప్రమాదాలు 20 మంది మృతి

విశాఖపట్టణం, ఆగస్టు 23,అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలింది. ఈ ప్రమాదం 18 మంది కార్మికులను పొట్టనపెట్టుకుంది. అయితే... ఈ ప్రమాదానికి కారణం ఏంటి...? కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యమేనా...? భద్రత ప్రమాణాలు పాటించకపోవడమేనా...? అంటే.. అవుననే అంటున్నారు ఫార్మా రంగం నిపుణులు. ఇంత పెద్ద ప్రమాదం జరగడానికి... పాతకాలం రియాక్టరే కారణమని స్పష్టం చేస్తున్నారు. ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లదే కీలక పాత్ర. వీటిలోనే రసాయనాలను కలుపుతారు. ఈ క్రమంలో... కొలతల్లో తేడా వచ్చినా... పీడనం, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉన్నా... రియాక్టర్లు పేలిపోతాయి. ఎసెన్షియా ఫార్మా కంపెనీలోనూ ఇదే జరిగిందంటున్నారు నిపుణులు. ఫార్మా కంపెనీల్లో తరచూ రియాక్టర్లు పేలడానికి సరైన పర్యవేక్షణ లేకపోవడమే కారణమని చెప్తున్నారు.చాలా కంపెనీలు ఇప్పటికీ పాత రియాక్టర్లనే వాడటం కూడా ప్రమాదాలకు దారితీస్తోందని అంటున్నారు. నిపుణులు అత్యాధునిక రియాక్టర్లలో అయితే.. ఎక్సో థర్మల్ రియాక్షన్ మొదలవగానే దానికదే నీటిని వెదజిమ్ముకోవడం.. లేదా ఉష్ణోగ్రతను తగ్గించుకోవడం చేస్తోంది. అలాగే.. తీవ్రతను బట్టి దానికదే ఆగిపోతుంది కూడా. కానీ.. పాత రియాక్టర్లనే ఆ ఫీచర్లు ఏవీ ఉండవు. దీంతో... తేడా వస్తే ... పేలుళ్లు తప్పవని అంటున్నారు. అచ్యుతాపురం సెజ్‌లోనే కాదు.. మన దేశంలో ఇప్పటికీ చాలా కంపెనీల్లో పాత రియాక్టర్లనే వాడుతున్నారు. కొత్త రియాకర్లు ఖరీదైనవి కావడంతో... పాతకాలం రియాక్టర్లనే కొనగిస్తున్నారు.

పాతకాలం రియాక్టర్లతో అప్రమత్తంగా ఉండాలి...

అచ్యుతాపురం సెజ్‌లో 280 ఫార్మా కంపెనీలు ఉన్నాయి. ప్రతి కంపెనీలోనూ రియాకర్టు ఉంటాయి. ఈ రియాక్టర్లలో అధిక ఉష్ణోగ్రతల మధ్య రసాయనాలను మరిగించాల్సి ఉంటుంది. అయితే.. రియాక్టర్‌పై ఒత్తిడి పెంచే సమయంలో నిపుణులు, కార్మికులు నిరంతరం పర్యవేక్షించుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా... వేడిని తట్టుకోలేని రియాక్టర్లు పేలిపోతాయి. 140 నుంచి 180 డిగ్రీలకు ఉష్ణోగ్రత పెరుగుతుంటే.. వెంటనే రియాక్టర్‌ను చల్లబరచాలి. రసాయనాలను మరిగించడం ఆపేయాలి. లేదంటే పేలుడు తప్పదు.

రియాక్టర్లు పేలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లు పేలడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రియాక్టర్ల దగ్గర తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. ప్రమాదాలను నివారించవచ్చని అంటున్నారు నిపుణులు. ఫార్మా, కెమికల్ ఫ్యాక్టరీల్లోని రియాక్టర్ల దగ్గర ఉష్ణోగ్రతలు, ప్రెషర్ గేజ్‌లు సక్రమంగా పని చేస్తున్నాయో లేదో చూసుకోవాలి. ఒత్తిడి ఎక్కువకాగానే.. అలారం మోగే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. రియాక్టర్లు ప్రెజర్ కుక్కర్ల లాంటింది. కుక్కర్లలో ప్రెజర్ ఎక్కువనప్పుడు.. ఆవిరి విజిల్ నుంచి బయటకు వచ్చేస్తుంది.

అలాగే.. రియాక్టర్లలోనూ రప్చర్ డిస్క్ ఉంటుంది. ప్రెషన్ ఎక్కువైనప్పుడు ఆ డిస్క్ ఊడిపోయి.. ఆవిరి బయటకు వచ్చేస్తుంది. దీంతో రియాక్టర్లపై ఒత్తిడి తగ్గుంది. ఆవిరి బయటకు రాన్నప్పుడే ప్రమాదాలు జరుగుతునాయి. కనుక... అంత కీలకమైన పనిని.. నిపుణులకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ.. కంపెనీల్లో నిపుణులకు అధిక జీతాలు ఇచ్చేకన్నా... ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కొత్త వారికి బాధ్యతలు అప్పగిస్తున్నారని తెలుస్తోంది. వారు.. తెలిసీతెలియక చేసే చిన్న పొరపాట్లు.. ప్రమాదాలకు కారణం అవుతున్నాయని భావిస్తున్నారు.

1997 నుంచి ఇప్పటి వరకు విశాఖలోని పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలు...

1997 నుంచి ఇప్పటి వరకు విశాఖలోని పరిశ్రమల్లో 23 ప్రమాదాలు...

1997 సెప్టెంబర్ 14: ఊఖఅఒ లిక్విఫైడ్ పెట్రోలియం స్టోరేజ్‌లో పేలుడు, 22 మంది మృతి

2012 జూన్ 13: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పేలుడు, 11మంది మృతి

2014: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కార్బన్ మోనాక్సైడ్ లీక్, ఇద్దరు ఇంజినీర్లు మృతి

2018 జనవరి 22: ఏఔఖఅలోని సైనార్ లైఫ్ సైన్సెస్‌లో పేలిన రియాక్టర్, ఇద్దరు మృతి

2019 డిసెంబర్ 27: పరవాడ ఏూఖఅలోని స్మైలాక్స్ లాబ్స్‌లో విషవాయువు లీక్, ఇద్దరు మృతి

2020లో విశాఖలోని పరిశ్రమల్లో నాలుగు ప్రమాదాలు...

2020 మే 7: వెంకటాపురంలోని ఎల్జీ పాలిమర్స్‌లో స్టైరిన్ గ్యాస్ లీక్, 12 మంది మృతి

2020 జూన్ 30: పరవాడలోని ఫార్మా కంపెనీలో బెంజీన్ గ్యాస్ లీక్, ఇద్దరు మృతి

2020 జులై 13: పరవాడ ఏఔఖఅలోని కంపెనీలో అగ్నిప్రమాదం, ఒకరు మృతి

2020 ఆగస్టు 1: హిందూస్థాన్ షిప్‌యార్డులో క్రేన్ ప్రమాదం, 11మంది మృతి

2021లో విశాఖలోని పరిశ్రమల్లో మూడు ప్రమాదాలు...

2021 సెప్టెంబర్ 21: అభిజిత్ ఫెర్రోలో గ్యాస్ లీక్, ఆరుగురికి గాయాలు

2021 నవంబర్ 29: రామ్‌కీ ఫార్మాసిటీలో టాక్సిక్ గ్యాస్ లీక్, ఇద్దరు మృతి

2021 డిసెంబర్ 25: పరవాడ ఫార్మా కంపెనీలో గ్యాస్ లీక్, ఇద్దరు మృతి

2022లో విశాఖలోని పరిశ్రమల్లో నాలుగు ప్రమాదాలు...

2022 ఏప్రిల్ 23: పరవాడ జేఎస్ ఫార్మాసిటీలోని ూఔఈ ప్రైవేట్ లిమిటెడ్‌లో అగ్నిప్రమాదం

2022 ఆగస్టు: అచ్యుతాపురం సెజ్‌లోని బ్రాండిక్స్ ఫ్యాక్టరీలో విషవాయువులు లీక్

2022 ఆగస్టు 8: పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

2022 డిసెంబర్ 26: ఏఔ ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్స్‌లో అగ్నిప్రమాదం, ఐదుగురు మృతి

2023లో విశాఖలోని పరిశ్రమల్లో ఐదు ప్రమాదాలు...

2023 జనవరి 31: అచ్యుతాపురం సెజ్‌లోని ఉఈఓూ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు, ఒకరు మృతి

2023 ఫిబ్రవరి 11: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదం, 9 మందికి తీవ్ర గాయాలు

2023 ఏప్రిల్ 18: పరవాడలోని విష్ణు కెమికల్స్‌లో ప్రమాదం

2023 జూన్ 30: అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మాలో రియాక్టర్ పేలుడు, ఆరుగురు మృతి

2023: ఆగస్టు 10: పరవాడలోని ఔఖఅ సింహాద్రి పవర్ ప్లాంట్‌లో ప్రమాదం, ఇద్దరు మృతి

2024లో జరిగి ప్రమాదాలు...

2024 ఏప్రిల్ 6: పరవాడలోని విశాఖ ఫార్మాసిటీ రెండు ప్రమాదం, ఇద్దరు మృతి

2024 జులై 17: అచ్చుతాపురం సెజ్‌లోని వసంత్ కెమికల్స్‌లో రియాక్టర్ పేలుడు, ఒకరు మృతి

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం

రేణిగుంట,శుక్రవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఉప ముఖ్య మంత్రి మరియు పంచాయితీ రాజ్, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం లభించింది.అయనకు జెసి శుభం బన్సల్, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, పులివర్తి నాని, ఆర్డీఓ రవి శంకర్ రెడ్డి, ఎస్ డి సి ప్రోటోకాల్ చంద్రశేఖర్, సిసి ఎఫ్ చంద్ర శేఖర్ రావు, డి ఎఫ్ ఓ సతీష్ రెడ్డి తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. తరువాత అయన అన్నమయ్య జిల్లాలోని పలు గ్రామ సభలలో పాల్గొనటానికి బయల్దేరి వెళ్లారు.

## వైకాపా నేతపై పిర్యాదు, కేసు నమోదు

నందిగామ ,తనపై అసభ్య మీమ్స్ బహిరంగ సభల్లో ట్రోల్ చేశాడని వైసిపి నేత షేక్ కరిముల్లా(దుబాయ్ ),కోడుకు షాహిల్ పై ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పిర్యాదు చేసారు. షేక్ కరిముల్లా(దుబాయ్), షేక్ షాహిల్ పై పోలీసులు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసారు.జగన్నన్న వాక్ వే ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అప్పటి మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పై మీమ్స్ వేసి కించపరిచారని ఫిర్యాదు చేసారు.దుబాయ్ లో ఉన్న కరిముల్లా, నందిగామకు వచ్చారని సమాచారం తో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## నెల్లూరు నగరంలో ఉద్రిక్తత

నెల్లూరు ,నెల్లూరు నగరంలో శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. రోడ్లపై తిరుగుతున్న పశువులను అధికారులు గోశాలకు తరలించడానికి ప్రయత్నించారు. పశువుల యజమానులు మూగజీవాలను రోడ్లపై అడ్డదిడ్డంగా మూగజీవాలను వదిలేస్తున్నారు. మూగజీవాలను గోశాలలకు తరలించాలని మంత్రులు, అధికారులు ఆదేశాలు జారీ చేసారు. శుక్రవారం నాడు కార్పొరేషన్ అధికారులు పశువులను పట్టుకుని 48వ డివిజన్ కు తరలించారు. అక్కడి నుంచి గోశాలకు తరలిస్తుండగా పశువుల యజమానులు అడ్డుకున్నారు.

## వలంటీర్ల వ్యవస్థ పై తాడో పేడో....

విజయవాడ, ఆగస్టు 23, ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 75 రోజులు దాటుతోంది. ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి టిడిపి కూటమి ప్రజలకు చాలా రకాల హామీలు ఇచ్చింది. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించింది. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు 5 ముఖ్యమైన ఫైళ్లపై సంతకం చేశారు. ఎన్నికల హామీలను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల ప్రారంభం వంటివి చేపట్టారు. ప్రాధాన్యత క్రమంలో మిగతా హామీలను అమలు చేస్తామని సీఎం చంద్రబాబు తో పాటు మంత్రులు చెబుతున్నారు.అయితే తమను కొనసాగిస్తారని చాలామంది వాలంటీర్లు ఆశించారు. కానీ మూడు నెలలు దాటుతున్న వారి విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల మంది వాలంటీర్లు ఉండేవారు. అయితే వారు వైసీపీకి అనుకూలంగా పనిచేస్తారని ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సంక్షేమ పథకాల అమలు బాధ్యత నుంచి వాలంటీర్లను తప్పించింది ఎన్నికల సంఘం. అయితే వైసిపి నేతల ఒత్తిడి మేరకు సగానికి పైగా వాలంటీర్లు పదవులకు రాజీనామా చేశారు. కానీ ఒక లక్ష మంది వాలంటీర్ల వరకు ఎటువంటి రాజీనామా చేయలేదు. ఎన్నికల ప్రచారంలో వాలంటీర్లు రాజీనామా చేయవద్దని కూడా చంద్రబాబు పిలుపునిచ్చారు. అందర్నీ కొనసాగిస్తామని.. పదివేల రూపాయలు గౌరవ వేతనం అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ గురించి ఇప్పుడు పట్టించుకోవడం లేదు. దీంతో వాలంటీర్లు పునరాలోచనలో పడ్డారు.ఇప్పటికే పింఛన్ల పంపిణీ బాధ్యతను సచివాలయ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ శాఖల సిబ్బందికి అప్పగించారు. గత రెండు నెలలుగా పింఛన్ల పంపిణీ విజయవంతంగా పూర్తి చేశారు. మరోవైపు వాలంటీర్ల వేతనాలు సైతం ఇవ్వడం లేదు. దీంతో వారి కొనసాగింపు పై నీలి నీడలు కమ్ముకున్నాయి. గత నెల నుంచి వారికి చెల్లించాల్సిన జీతాలు కూడా చెల్లింపులు చేయడం లేదు. కనీసం వారి ప్రస్తావన కూడా లేదు. దీంతో కొనసాగింపు పై అనుమానాలు నెలకొన్నాయి. అసలు కూటమి ప్రభుత్వానికి వలంటీర్లను కొనసాగించే ఉద్దేశం ఉందా? లేదా అన్నది ఇప్పుడు అనుమానం కలుగుతోంది.అయితే క్షేత్రస్థాయిలో మాత్రం వాలంటీర్లు వద్దన్నది టిడిపి నేతల నుంచి వినిపిస్తున్న మాట. దుబారా ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా వాలంటీర్ వ్యవస్థను తొలగించడమే మేలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది. అయితే తమను కొనసాగిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు కనుక.. ఎట్టి పరిస్థితుల్లో తమను వాలంటీర్లుగా తీసుకోవాలని వారి నుంచి డిమాండ్ వినిపిస్తోంది. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన రావడం లేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపనే తప్ప.. ఎవరూ పెద్దగా స్పందించడం లేదు.ఇప్పటివరకు ఓపిక పట్టిన వాలంటీర్లు ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని భావిస్తున్నారు. తమకు వేతనం పెంచి ఇస్తామన్న హామీను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఈనెల 27న ఏపీ మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో వాలంటీర్ల విషయంలో ఒక నిర్ణయానికి రావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యమ కార్యాచరణ పై ఈనెల 31న రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఉద్యమానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవడానికి సిద్ధపడుతున్నారు. మొత్తానికి అయితే ఉద్యమం వైపు వాలంటీర్లు అడుగులు వేస్తుండడం విశేషం

## చుక్క నీరు చేరలేదు-- పరిహారం రాలేదు

### సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ భూ నిర్వాసితులకు మంత్రి తుమ్మల ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

### తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

ఏన్కూరు, సీతారామ ప్రాజెక్టు పంపు హౌజ్ లు ఆగస్టు 15 ప్రారంభం చేసిన సాగర్ లింక్ కెనాల్ కు ఒక చుక్క నీరు చేరలేదు-- అని భూ నిర్వాసితులకు పరిహారం రాలేదు అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం తెలంగాణ రైతు సంఘం బృందం లింక్ కెనాల్ ను పరిశీలన చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు బాలాజీ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ పనులు పూర్తి కావడానికి మరో రెండు సంవత్సరాలు పైగా సమయం పడుతుంది అని అప్పటి వరకు పూర్తి అయిన కాలువలు ద్వారా సాగర్ ఆయకట్టు పరిధిలో కొన్ని మండలాల్లో సాగు భూములకు నీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ ను ఏన్కూరు మండలం సాగర్ కాలువ హైడ్ రెగ్యులేటరీ వద్ద అనుసంధానం చేయుటకు లింక్ కెనాల్ 8 కిలోమీటర్ల నిర్మాణం చేయుటకు సంకల్పించి భూ సేకరణ గేజిట్ నోటిఫికేషన్ లేకుండా పరిహారం అవార్డు ప్రకటించకుండా పనులు ప్రారంభం చేసింది అన్నారు.రైతులు కాలువలు నిర్మాణం పై అభ్యంతరం వ్యక్తం చేశారు ఉద్యమం ప్రారంభం కావడం తో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చోరవ చూపి రైతులకు సరైన నష్టపరిహారం అందించే హామీ ఇచ్చారు, ఆగస్టు లో సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి చేతులు మీదుగా పరిహారం అందిస్తామని మాట ఇచ్చారు. జిల్లా లో సీనియర్ మంత్రి తుమ్మల పై ఏన్కూరు ప్రాంత రైతులకు ఉన్న గౌరవం తో భూమి పరిహారం అందించకుండనే కాల్వలు నిర్మాణం కు రైతులు పూర్తిగా సహకరించారు కానీ ముఖ్యమంత్రి ఆగస్టు 15 ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించి సీతారామ ప్రాజెక్టు పూసు గూడెం పంపు హౌజ్ ప్రారంభం చేసి వైరా నియోజకవర్గ కేంద్రం లో సాగు కు జీవం రైతుకు ఊతం సభ లో పాల్గొన్న లింక్ కెనాల్ భూ నిర్వాసితులకు పరిహారం పై ఏలాంటి స్పష్టత ఇవ్వలేదు అని రాంబాబు, బాలాజీ అన్నారు.ఏన్కూరు మండలం లో హిమామ్ నగర్ , ఏన్కూరు రేపల్లె వాడ జూలూరుపాడు మండలం లో వినోబా నగర్ లో రెండు పంటలు పండి ఆధిక దిగుబడులు వచ్చిన సారవంతమైన భూములు లింక్ కెనాల్ కోసం 100 ఎకరాలు భూ సేకరణ జరిగింది అని ఎకరాకు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం ఏభై లక్షల రూపాయలు పరిహారం అందించాలి అని కోరారు, పామ్ ఆయిల్ తోటలు కాల్పోయిన రైతులకు నాలుగు సంవత్సరాల పెంచిన తోట లో ఒక చెట్టు కు 2001 చట్టం ప్రకారం మూడు, నాలుగు వందల రూపాయలు పరిహారం లెక్క వేయడం సరికాదని ఒక ఎకరం విస్తీర్ణంలో 57-60 పామాయిల్ మొక్కలు పెంచడం జరుగుతుంది నాలుగు సంవత్సరాల కౌలు ఎకరాకు ఒక లక్ష ఇరవై వేల రూపాయలు అవుతుంది మొక్కు రెండు వేల కౌలు ఖర్చు, ఎరువులు పురుగుమందులు కూలీల, సాగు నీరు నాలుగు సంవత్సరాల ఖర్చు కలిపి అదనంగా మూడు రేట్లు కలిపి పామాయిల్,ఇతర పండ్ల తోటలు పరిహారం అందించాలి అని రాంబాబు బాలాజీ డిమాండ్ చేశారు భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలి అని లేకపోతే రైతు ఉద్యమం తప్పదు అని అన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దోంతిబోయిన నాగేశ్వరరావు రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తమ్మినేని వెంకటయ్య,గుండా సత్యనారాయణ రెడ్డి రేపల్లె వాడ మాజీ ఎంపిటిసి భూక్యా లక్ష్మా, గార్లఒడ్డు సోసైటి వైస్ చైర్మన్ రేగళ్ళ తిరుమల రావు, ఇంజం వేణు,ఇటికాల లెనిన్ రాయమాధరం మాజీ సర్పంచ్ కోడెం బిక్షం, నామా కృష్ణారావు, బాబు తదితరులు పాల్గొన్నారు

## సాక్షి పత్రిక ప్రతులు దగ్ధం

మడకశిర - మడకశిర పట్టణం, అంబేద్కర్ సర్కిల్ లో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు ఆధ్వర్యంలో సాక్షి దినపత్రికను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రోజు మాట్లాడుతూ ఈరోజు సాక్షి పత్రికలో మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులో 17 గురు ఎమ్మెల్యేలు అంటూ ఓ కథనం ప్రచురితం చేశారు. అందులో 16వ సభ్యునిగా తన పేరు రాశారని, సాక్షి పత్రిక అసత్య ప్రచారాలు, అబద్ధాలు ప్రచురించడంలో దిట్ట అని, వార్త రాసే ముందు పూర్వపరాలుపరిశీలించి రాయాలని అన్నారు. నిజంగా మీరు రాసిన కథనానికి తీసుకు నాకు సంబంధం నైతిక బాధ్యతగా మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. అది అబద్ధమని నేను రుజువు చేస్తే మీరు మీ సాక్షి ఛానల్ సాక్షి దినపత్రికను నిలిపి వేస్తారా అంటూ సాక్షి యాజమాన్యం పై మండిపడ్డారు. నా మీద ఉన్నటువంటి కేసులు 55 అని,, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మైనార్టీల మీద మహిళలపై దాడులను ఖండిస్తూ నేను చేసిన పోరాటంలో 55 కేసులు నాపైన పెట్టించారని అన్నారు. సాక్షి దినపత్రిక సబ్ ఎడిటర్లు ఎడిటర్లు, వార్త రాసే ముందు పూర్వపరాళ్ళు క్లియర్ గా పరిశీలించి రాయాలని తనపై అసత్య ప్రచారాలు వ్రాసినటువంటి సాక్షి దినపత్రికకు సంబంధించిన యాజమాన్యంపై లీగల్ గా నోటీసులు పంపిస్తున్నానని అన్నారు.

## ఆ 135 కోట్లు ఎలా..ఫ్రీ బస్సు పై మేధోమధనం

తిరుపతి, ఆగస్టు 23, అసెంబ్లీ ఎన్నికల?లో టీడీపీ కూటమి సూపర్ సిక్స్ పేరుతో ప్రచారం చేసింది. ఆరు హామీల్లో మహిళలకు ఉచిత బస్ ఒకటి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు నెలలు కావస్తున్న ఈ ఆరు హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదు. అయితే ఈ ఆరింట్లో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అమలు చేసేందుకు చర్చలు జరుగుతోన్నాయి. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత బస్ ప్రయాణంపై సమీక్ష కూడా నిర్వహించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 10 వేల ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. అందులో 8,220 బస్సులు సొంతవి కాగా, మిగిలిన బస్సులు అద్దెవి. గత ప్రభుత్వం హయంలో కొత్తగా 1,480 బస్సులు కొనుగులు చేపట్టింది. అయితే ఈ బస్సులు ఎన్నికల తరువాత డెలివరీ అయ్యాయి. ఇప్పుడు ఆ బస్సులను కూటమి నేతలు ప్రారంభిస్తున్నారు.అయితే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే అదనంగా మరో 2,000 వేలు కొత్త బస్సులు అవసరం అవుతాయి. అలాగే 3,500 మంది కొత్తగా డ్రైవర్లు కావాల్సి ఉంటుందని ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం చేసిన అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీని వినియోగించుకుని 1,253 విద్యుత్ బస్సులను సమకూర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.ఉచిత బస్సు ప్రయాణం వల్ల ప్రతినెల రూ.250 కోట్ల నుంచి రూ.260 కోట్ల ఆర్థిక భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడుతుంది. అయితే తప్పని సరిగా ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీకి లాభం వస్తుంది. అలాగే అక్యుపెన్సి రేషియో (ఓఆర్) వంద శాతానికి చేరుకుని ఆర్టీసీ లాభాలు వస్తాయి. ప్రతినెల ఆర్టీసీకి వచ్చే ఆదాయంలో 25 శాతం ( దాదాపు రూ.125 కోట్లు) వరకు ప్రభుత్వానికి వెళ్తోంది.ఇకపై ఆ మొత్తం రాకపోగా, అదనంగా రూ.125 కోట్ల నుంచి రూ.135 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడుతోంది. వాస్తవానికి మహిళలకు ఉచిత బస్సును ఆగస్టు 15 నుంచే అమలు చేస్తామని ప్రకటించారు. అయితే ఈ పథకంపై ఇంకా పూర్తి స్థాయి స్పష్టత రాకపోవడంతో తాత్కాలికంగా వాయిదా పడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటి నుంచో 60 ఏళ్ల దాటిన సీనియర్ సిటిజన్స్‌కు 25 శాతం రాయితీ ఉంది.ఇప్పటికే దేశంలో పది రాష్ట్రాల్లో ఉచిత బస్సు పథకం అమలు అవుతోంది. కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో అమలు అవుతోంది. కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ పథకం పూర్తి స్థాయిల్లో అమలు అవుతోందికేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో పాక్షికంగా అమలు అమలు అవుతోంది. కేరళలో మత్స్యకారులకు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చారు. మహారాష్ట్రలో 65 ఏళ్లు దాటిన మహిళలకు 50 శాతం రాయితీ, 75 ఏళ్లు దాటిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు జరుగుతోంది.హర్యానాలో 60 ఏళ్లు దాటిన మహిళలకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో నారీకి నయన్ స్కీమ్ పేరుతో మహిళలందరికీ 50 శాతం రాయితీ కల్పించారు. ఉత్తరప్రదేశ్‌లో 60 ఏళ్లు దాటిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందిస్తున్నారు.అలాగే ప్రపంచంలో అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి 48 దేశాల్లోని వివిధ నగరాల్లో కూడా ఈ ఉచిత బస్సు పథకం అమలు అవుతోంది. అమెరికాలోని కేంసన్ లక్సెంబర్గ్ దేశంలో పూర్తిగా, పెండ్లాన్‌లోని మేరీ హాయం, ఆస్ట్రేలియాలోని పెర్త్, ఇంగ్లాండ్ లోని డ్యూస్ బరి, స్వీడన్ లోని అవిష్టా, బల్గేరియాలోని స్మకౌలో ఉచిత ప్రయాణాలు అమలు జరుగుతోన్నాయి.

తెలంగాణలో అమలు తీరుతెలంగాణలో దాదాపు ఆరు నెలల్లోనే రూ.1,080 కోట్లు ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. రోజువారీ టిక్కెట్లు ద్వారా వచ్చే ఆదాయం రూ.16 కోట్లు నుంచి రూ.10 కోట్లకు తగ్గింది. ఈ పథకం అమలకు ముందు తెలంగాణలో రోజుకు 34 లక్షల మంది బస్సును ఉపయోగించే ప్రయాణికులు ఇప్పుడు 47 లక్షల ప్రయాణికులకు పెరిగింది.

## 26 వ తేదీ సోమవారం కృత్తిక నక్షత్రము సందర్భంగా సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు..



కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 23 విభారె న్యూస్.. 26-08-24, సోమవారం, సప్తమి తిథి తో కూడి కృత్తిక నక్షత్రం ఉంది.. ఇది చాలా విశేషమైన యోగం..ఈరోజు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారిని ఆరాధిస్తే దీర్ఘ కాలంగా ఉన్న సమస్యలన్నిటి నుండి విముక్తి కాగలరు. .సంతాన సమస్యలు, ఆరోగ్య సమస్యలు, వివాహ సమస్యలు, భూ సమస్యలు ఉన్నవారు, శ్రీ స్వామి వారిని ఆరాధించడం ద్వారా తమ సమస్యలనుండి విముక్తి పొందగలరు..అభిషేకం - 200/-కావడిసేవ - 250/-మాసపూజ -300/-సుబ్రహ్మణ్య హోమం - 3,500/-సుబ్రహ్మణ్య కళ్యాణం -2,500/-సంప్రదించండి :-శ్రీధర్ శర్మ-7995202082దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777

## విద్యా శాఖ ఉర్దూ మాధ్యమంలో ఉన్న సమస్యలు పరిష్కరించండి - ఆప్టా




కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 23 విభారె న్యూస్..విద్యా శాఖ లో ఉర్దూ మాధ్యమంలో ఉన్న సమస్య లను పరిస్కరించవలసినదిగా ఆంధ్ర ప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు ఎ జి ఎస్ గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు ఒక లేఖను రాష్ట్ర మైనార్టి సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎన్ ఎం డి ఫరూఖ్ కి,రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ బాబు కి, విద్యా శాఖ అధికారులను కోరారు. వీరి లేఖను అన్నమయ్యజిల్లాఆప్టా ప్రధానకార్యదర్శినాదీర్ష, ఇతర ఆప్టా నాయకులు మైనార్టీ సంక్షేమశాఖమంత్రివర్యులు ఎన్ఎండి ఫరూఖ్ కి అందచేయటం జరిగింది. ఈ సందర్బంగా మంత్రి స్పందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి తో,మానవ వనరుల శాఖ మంత్రి తో సంప్రదించి ఉర్దూ టీచర్ల కొరకు ప్రత్యేక డిఎస్సి, డైట్ కాలేజి లో పోస్టుల భర్తీ ఉర్దూ పాఠశాల కు సంబందించిన ప్రత్యేక బడ్జెట్ విడుదల మొదలైన అన్ని సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తాను అని హామీ ఇవ్వటం జరిగింది.

## పెద్దతరహా పరిశ్రమల్లో యంత్ర పరికరాల వాడుకంపై అవగాహన..



ఎమ్మిగనూరు ఆగష్టు 23 విభారె న్యూస్..పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు శుక్రవారం ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో పెద్దతరహా పరిశ్రమల్లో యంత్ర పరికరాలు వాడుకంపై మంత్రాలయం రోడ్డులో పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీలో 8వ, 9వ తరగతి విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ పెద్దతరహా పరిశ్రమల్లో గతంలో పెద్ద పెద్ద మిషనరీలు,కూలీలు ఎక్కువగా ఉపయోగించే వారని, అయితే ప్రస్తుతం మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో యంత్రాల ఉపయోగంలో మార్పు వచ్చిందని చెప్పారు. జిన్నింగ్ ప్యాక్టరీలో పత్తి నుంచి విత్తనాలు వేరు చేయటానికి గతంలో కూలీలతో వారం రోజులు పనిచేసి పూర్తి చేసేవారు, అయితే ఇప్పుడు వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల ద్వారా వారం రోజులు కూలీలు చేసే పనిని ఒక్కరోజులోనే పూర్తి చేస్తున్నారనేది విద్యార్థులకు అర్థం అయ్యేల క్షేత్రస్థాయిలో వారికి చూయించటం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఇంకా మార్పులు వచ్చే అవకాశం ఉందని,నేటి విద్యార్థులే రేపటి ఇంజనీర్లు కావచ్చునని తెలిపారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## ఆదాని మెగా కుంభకోణంపై దర్యాప్తు జరపాలి....

**- కాంగ్రెస్ పార్టీ డిమాండ్**
**- సెబీ చీఫ్ రాజీనామా చేయాలని డిమాండ్**



ఎమ్మిగనూరు ఆగష్టు 23 విభారె న్యూస్..ఆదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యడ్జీల తో నిరసన..అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ(ఏ ఐ సి సి) కమిటీ దేశవ్యాప్త నిరసన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలో సోమప్ప సర్కిల్ నందు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కసిం వలి, విద్యార్థి విభాగం ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్,ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆదానికి ,సెబీ చీఫ్ కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఆదాని మెగా కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని,ఎస్ ఈ బి ఐ చైర్ పర్సన్ అక్రమాలపై దర్యాప్తునకు జాయింట్ పార్లమెంటు కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ పార్టీగా డిమాండ్ చేస్తున్నామనితెలిపారు. సెబీ చీఫ్ మాధురి పూరి బుచ్ తో వ్యాపారవేత తో వ్యాపార సంబంధాలు ఉన్నట్లు హిండెన్ బర్గ్ ఆరోపించిన దరిమిలా సెబీ చీఫ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం బడ వ్యాపారులకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ బీజేపీకేంద్ర ప్రభుత్వ హయాంలో అనేక కుంభ కోణంలు జరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. దేశంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్,ఎన్ ఎస్ యు ఐ బనవాసి జైపాల్ లోకేష్ , రఫీక్ ,నబి రసూల్, ఇమ్రాన్ అక్బర్ ఇబ్రహీం, కుమార్ ,అజయ్ పాల్గొన్నారు.

## బ్రిటీష్ వారి తుపాకి గుళ్లకు ఎదురొడ్డి నిలిచిన మన ఆంధ్రకేసరి టంగుటూరి..

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కె బాబురావు..**






కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 23 విభారె న్యూస్.. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారి తుపాకీ గుళ్ళకు ఎదురు నిలిచి బ్రిటిష్ వారికి ముచ్చెమటలు పట్టించిన మన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె బాబురావు అభిప్రాయ పడ్డారు. శుక్రవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152 వ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాబురావు మాట్లాడుతూ 1928 వ సంవత్సరంలో మద్రాస్ పట్టణంలో సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా సైమన్ గోబ్యాక్ హర్తాళ్ కు భయపడి అగ్రనాయకు లందరూ పట్టణాన్ని విడిచి వెళ్లిపోగా ప్రకాశం పంతులు ఒక్కరే స్వయంగా నిలబడి హర్తాళ్ జరిపారని లక్షలమంది పాల్గొన్న ఈ ఉద్యమంలో బ్రిటీష్ వారి తుపాకీకి ఒక యువకుడు బలి అయి రోడ్డు మీద పడిపోయిన యువకుడి వద్దకు వెళుతున్న ప్రకాశం పంతులును ముందుకు కదిలితే తుపాకీ తూటాలకు బలి కావల్సి వస్తోందంటూ బ్రిటీష్ సిపాయిలు హూంకరించారని వెంటనే ప్రకాశం పంతులు ఆవేశంతో చొక్కా విప్పి ముందుకు దూకి బ్రిటిష్ వారి తుపాకీకి తన గుండెను చూపించి కాల్చుకోండిరా ! అని ఎధిరించిన ధీశాలి అని ఒక్కసారిగా బ్రిటిష్ వారి ధైర్యం సన్నగిల్లిందని, ఉద్యమకారుల్లో ధైర్యం కొండంత పెరిగిందని బ్రిటిష్ వారి తుపాకులు నేలచూపులు చూడగా ప్రకాశం కీర్తి ఆకాశాన్ని తాకిందని ఫలితంగా ఆంధ్రకేసరిగా వారి పేరు స్వరాజ్య చరిత్ర పుటలకెక్కిందని ఆనాటి నుండి ఆయన ఆంధ్రకేసరిగా ప్రసిద్ధులయ్యారని ఆంధ్రరాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పనిచేశారని బాబురావు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రకాశం పంతులు చిత్ర పటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబురావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన అభ్యర్థి కర్నూలు షేక్ జిలాని భాష, కోఆర్డినేషన్ చైర్మన్ అనంతరత్నం, డిసిసి ఉపాధ్యక్షులు బి బతుకన్న, కే వెంకటరెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శులు పోతుల శేఖర్, సయ్యద్ నవీద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, డాక్టర్ సుభాన్, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రాముడు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్సీ బజారన్న,మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముర్షిద్ షీర్ ఖాద్రి, డిసిసి కార్యదర్శులు బి సుబ్రహ్మణ్యం,జేవీ అభి నాయుడు,అబ్దుల్ హై, ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజు మహిళా కాంగ్రెస్ సిటీ అధ్యక్షురాలు ఏ లలిత,కాంగ్రెస్ నాయకులు షేక్ మాలిక్, జాన్ సదానందం,మద్దిలేటి కేశవ రెడ్డి ,అన్వర్ భాష మహిళా కాంగ్రెస్ హైమావతి,రాజేశ్వరి, సలోమి,స్వప్న మొదలగు వారు పాల్గొన్నారు.

## బిజెపి కర్నూలుజిల్లా సభ్యత్వనమోదు కార్యక్రమం



విభారే న్యూస్. ఆగస్టు 23 కర్నూలు ప్రతినిధి బిజెపి కర్నూలు జిల్లా అధ్యక్షులు శ్రీకునిగిరినీలకంఠ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమం 2024 కర్నూలు జిల్లా కార్యశాల ఆగస్టు 23 న ఎమ్మిగనూరు నగరంలో కుర్ణి కమ్యూనిటీ హాల్ నందు జరిగినది కార్యక్రమంలో కర్నూలు జిల్లాలో వున్నటువంటి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు అసెంబ్లీ నాయకులు మండల నాయకులు జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ మురళినాయుడు కార్యశాలను ఉద్దేసించి మాట్లాడుతూ బిజెపి సభ్యత్వ నమోదు రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా అత్యదికంగా నమో యాప్ ద్వార కాని బార్ కోడ్ ద్వార కాని టోలి ఫ్రీ నెంబర్ ద్వార కాని సభ్యత్వ నమోదు చేసి చేయించాలని మార్గోపదేశం చేయాలన్నారు నగురూరి రాఘవేంద్ర వేల్పులగోపాల్ శ్రీరాములుయాదవ్ ఉపేంద్ర నరసింహులు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా మరియు తాహెర హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం




విభారే న్యూస్. ఆగస్టు 23. నంద్యాల. పద్మ విభూషణ్ డాక్టర్ చిరంజీవి జన్మదినము అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యుడు యాకుబ్ గారి కుమారుడు సాహిల్ జన్మదినం సందర్భంగా స్థానిక ఎన్జీవో కాలనీలోని నారాయణ హై స్కూల్ నందు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం నందు దాదాపు 30 మందికి పైగా రక్తదానం చేయడం జరిగిందని స్కూల్ డైరెక్టర్ డాక్టర్ యాకూబ్, కరస్పాండెంట్ ఇషాకవలి లు తెలిపారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ ఆర్ మారుతి కుమార్, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు రమేష్ రావు,బాలుడు, శ్రీనివాస్,నావభారత్ స్కూల్ హుస్సేన్గారు నలంద స్కూల్ ఉత్తేజ్ గారు, శ్రీ సాయివణి స్కూల్ హుస్సేన్ భాష నారాయణ స్కూల్ కరెస్పాండెంట్ ఇషాక్ వలి శిరీష మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ దమ అభిమాన హీరోల పుట్టినరోజులకు తమ పిల్లల పుట్టిన రోజులకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయమని, అందులో భాగంగా యాకుబ్ తన రెండవ కుమారుడు సాహిల్ పుట్టినరోజున ఇలాంటి సేవా కార్యక్రమం ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమని ప్రతి ఒక్కరు కూడా సామాజిక సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని తెలిపారురెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈరోజు రక్తదాన శిబిరం నిర్వాహకులు యాకూబ్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ కు రక్తదానం చేయడం ద్వారా తలస్మియా చిన్నారులకు రక్తం ఉచితంగా ఇవ్వడంతో పాటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స వారికి తక్కువ ధర ఇవ్వడం అలాగే రక్త సేకరణ ద్వారా విద్యార్థిని విద్యార్థుల శిక్షణ తరగతులకు సామాజిక సేవ కార్యక్రమాలకు పర్యావరణ పరిరక్షణకు ఖర్చు చేయడం జరుగుతుందన్నారుఈ కార్యక్రమంలో దాదాపు 30 మంది రక్తదానం చేయడం జరిగింది

### జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వివిధ అంశాలపై విద్యార్థుల్లో అవగాహన ...

కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 23 విభారె న్యూస్..వాసవి కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎక్సైజ్ సీఐ రాజేంద్రప్రసాద్,కర్నూల్ ఒకటవ పట్టణ సీఐ రామానాయుడు ఆధ్వర్యంలో కర్నూల్ వాసవి మహిళా కళాశాలలో పలు అంశాలపై అవగాహన చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న సైబర్ నేరాల గురించి డ్రగ్స్ వినియోగం వల్ల వచ్చే నష్టాల గురించి,ముందస్తు జాగ్రత్తలు... ఫేక్ కాల్స్, తదితర మోసాలు గురించి తెలియజేశారు. అంతేకాకుండా బాల్య వివాహాల అనర్థాలు,ఫోక్సో చట్టం, డ్రగ్స్ దుష్పరిణామాలు,డయల్ - 100, తదితర అంశాలపై వివరించారు. జిల్లాలో ఎవరైనా గంజాయి, మాదకద్రవ్యాలు ఉన్నట్లు ఖచ్చితమైన సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 14500 నెంబర్ కు కాల్ చేసి సమాచారం ఇచ్చినా వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. యువత భవిష్యత్ ను మంచిగా మార్చుకోవాలని సూచించారు.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**